పుర బడ్జెట్ రూ.26.11 కోట్లు

- ఆదాయ, వ్యయాలపై చర్చ లేకుండానే ఆమోదం
- అన్ని విభాగాల కార్యాలయాల నిర్వహణకు కేటాయింపులు
- వార్డుల వారీగా అభివృద్ధి పనులకు రూ.2.01 కోట్ల ప్రతిపాదన


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

వనపర్తి టౌన్: పురపాలిక 2023–24 వార్షిక బడ్జెట్‌ను మంగళవారం పాలక మండలి ఆమోదించింది. పుర చైర్మన్ గట్టుయాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ.17.88 కోట్లు, కాపిటల్ ఫండ్ (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లు) రూ.7.73లక్షల అంచనాలను కలుపుకొని 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.26.11 కోట్ల బడ్జెట్‌ను రూ పొందించారు. కలెక్టర్ సమక్షంలో ప్రతిపాదించిన బడ్జెట్ ఆదాయ, వ్యయాలపై ఎలాంటి చర్చ లేకుండానే కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

పచ్చదనానికి పెద్దపీట

మున్సిపాలిటీ చట్టం 2019 సెక్షన్ 107, 108 ప్రకారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. గతేడాది మొత్తం బడ్జెట్‌లో 2022–23 నాటికి ప్రారంభ నిల్వ రూ. 3.24కోట్లు చూయించగా.. 2024 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి మిగులు బడ్జెట్ రూ.53.95 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. గ్రీన్ బడ్జెట్‌కు రూ.1.58కోట్లు ప్రతిపాదించారు. తప్పనిసరిగా చెల్లించాల్సిన ఖర్చులు, నిర్వహణ పోనూ మిగిలిన బడ్జెట్‌లో 1/3వ వంతు బడ్జెట్‌ను అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలు, బలహీన వర్గాల ప్రజలు నివాసం ఉండే కాలనీలు, మైనార్టీ, మురికివాడల ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.33.31 లక్షలు కేటాయింపులు చేశారు. తప్పనిసరి చెల్లించాల్సిన కేటాయింపులు (సిబ్బంది వేతనాలు, శానిటేషన్ విభాగం ఖర్చులు, కరెంట్ చార్జీలు, రుణాల చెల్లింపు, గ్రీన్ బడ్జెట్) కోసం రూ. 10.86 కోట్లు చూపారు. ఇంజినీరింగ్ విభాగం నిర్వహణ ఖర్చులు రూ. 2.99 కోట్లు చూపగా, కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఇతరత్రా సామగ్రికి రూ. 91.90లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు.

ఆదాయ సమీకరణపై దృష్టి

2024 నాటికి పన్నుల ద్వారా మున్సిపాలిటీకి రూ.4.96కోట్లు, టౌన్ ప్లానింగ్‌లో బిల్డింగ్ అనుమతుల జారీ ద్వారా వచ్చే అంచనా ఆదాయం రూ.6.45కోట్లు, ఇంజినీరింగ్ విభాగం నుంచి వచ్చే నల్లా బిల్లుల ఆదాయం రూ. 2.086 కోట్లు, శానిటేషన్ నుంచి వచ్చే ట్రేడ్ లైసెన్స్, ప్లాస్టిక్ నియంత్రణ జరిమానాలు, ఇతరత్రాల ద్వార వచ్చే అంచనా ఆదాయం రూ.71.70 లక్షలు ఉండొచ్చని అంచనా వేశారు. వార్డుల వారీగా అభివృద్ధి పనులకు రూ. 2.01 కోట్లు కేటాయించారు. ప్రారంభ నిల్వ, అంచనా ఆదాయాలను కలిపి రూ.18.40కోట్లుగా చూపారు. 2024 మార్చి చివరి నాటికి అంచనా ఖర్చు రూ.17.86 కోట్లు చూపగా.. అసైండ్ రెవెన్యూ ద్వారా వచ్చే ఆదాయం రిజిస్ట్రేషన్ శాఖ నుంచి నేరుగా ప్రభుత్వ ఖాతాలో జమ అవుతుండటంతో బడ్జెట్‌లో జీరో ఆదాయంగా చూయించారు. బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా పాలకులు, అధికారులు ముందుకెళ్లాలని కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ కౌన్సిలర్లకు సూచించారు. ఆదాయ వ్యయాలపై చర్చించేందుకు ఏర్పాటైన బడ్జెట్ సమావేశంలో చర్చ జరగకపోవడం గమనార్హం. బడ్జెట్ ప్రతులను జేఏఓ కృష్ణయ్య చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కమిషనర్ విక్రమసింహారెడ్డి, డీఈ సూర్యనారాయణ, మేనేజర్ అనిల్, ఏఈలు భాస్కర్, హేమలత, ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

పాన్‌గల్: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న సీపీఎం జన చైతన్య యాత్ర బహిరంగ సభకు మంగళవారం గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బాల్యానాయక్ ఆధ్వర్యంలో గిరిజనులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బాల్యానాయక్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ మతోన్మాద విధానాలను ఖండిస్తూ, ఎస్సీ, ఎస్టీ చట్టాలను అమలు చేయడంలో కేంద్రం ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజా చైతన్య యాత్రకు గిరిజనులు భారీగా తరలివెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు.

బైక్ ర్యాలీ


వీపనగండ్లలో బైక్ ర్యాలీ చేస్తున్న నాయకులు

వీపగనండ్ల: సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జరగనున్న జనచైతన్య బస్సు యాత్రకు సంఘీభావంగా మండల కేంద్రంలోని సీపీఎం నాయకులు మంగళవారం బైక్ ర్యాలీ చేపట్టారు. రంగాపూర్ నుంచి పెబ్బేరు మీదుగా జిల్లా కేంద్రానికి బయలుదేరారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ బస్సు యాత్రలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


పోషక పదార్థాలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీలు

వీపనగండ్ల: పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పోషక విలువలతో కూడిన పదార్థాలపై అంగన్‌వాడీ అధికారులు, టీచర్లు, మహిళలకు అవగాహన కల్పించారు. సంగినేనిపల్లి రెండో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ అభియాన్, అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమానికి ము ఖ్య అతిథిగా హాజరైన ఎంపీటీసీ ఇంద్రకంటి వెంకటేశ్ మాట్లాడుతూ పోషకాలు ఎక్కువగా ఉండే ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, లక్ష్మీదేవి, కృష్ణమ్మ, రాధ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ప్రతిభ


కావేరికి ప్రశంసా పత్రం అందిస్తున్న నిర్వాహకులు

వనపర్తి క్రైం: నెహ్రూ యువ కేంద్రం పాలమూరు ఆధ్వర్యంలో పాలమూరు విశ్వ విద్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి చిత్రలేఖనంలో వనపర్తికి చెందిన నాగమోని మన్యం కుమార్తె కావేరి ఉమ్మడి జిల్లా స్థాయి చిత్రలేఖనంలో అత్యంత ప్రతిభ కనబర్చి రెండో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా నిర్వాహకులు చిన్నారికి రూ.1,500 నగదు, ప్రశంసాపత్రం, షీల్డ్‌ను అందజేశారు. నెహ్రూ యువ కేంద్ర పాలమూరు స్టేట్ డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు, ఆటల్లో కూడా తమ ప్రతిభ కనబర్చాలన్నారు. కార్యక్రమంలో హిందూవాహిని విభాగ్ కన్వీనర్ అభిలాష్, తిరుమలేష్, రాజేందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

బోధకాలు రక్త నిర్ధారణ పరీక్షలపై అవగాహన

వనపర్తి క్రైం: బోధకాలు రక్త నిర్ధారణ పరీక్షలపై మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో పీహెచ్‌సీల వైద్యులు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సుకు హైదరాబాద్ నుంచి కీటక జనిత వ్యాధుల డిప్యూటీ డైరెక్టర్ వెంకటేష్ హాజరై మాట్లాడుతూ జిల్లాలోని 60 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఉండే 6 నుంచి 7 ఏళ్ల పిల్లలకు ఏప్రిల్ 1 నుంచి 5 రోజులు రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించాలన్నారు. దీనికోసం 10 టీంలను విభజించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ రవిశంకర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాసులు, జిల్లా వైద్యాధికారులు సౌభాగ్యలక్ష్మి, రాంచందర్‌రావు, ప్రోగ్రాం అధికారి సాయినాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌జీ తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



పెబ్బేరు: మండలంలో రంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కొంతం గోవర్ధన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనం రుచికరంగా, నాణ్యతగా అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే సివిల్‌సప్లయ్ నుంచి సమయానికి బియ్యం అందించడం లేదని తమ దృష్టికి తీసుకురావడంతో వెంటనే జిల్లా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు.

మిషన్ భగీరథలో మురుగు నీరు సరఫరా


కలుషిత నీటితో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమరచింత: మండలంలోని చంద్రనాయక్‌తండాలో మిషన్‌భగీరథ నీరు కలుషితంగా సరఫరా అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తండావాసులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పక్షం రోజుల నుంచి చంద్రనాయక్ తండా పంచాయతీ పరిధిలో మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు కలుషితంగా వస్తుందని, దీంతో ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్న పరిస్థితులు దాపరించాయన్నారు. విషయాన్ని పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు మిషన్ భగీరథ ద్వారా సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీఓ నరసింహులుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, తండావాసులు హనుమంతునాయక్, నాగునాయక్, లింగానాయక్, తౌఫిక్, పోషిరిగారి విష్ణు, అస్సు, ఖాసీం పాల్గొన్నారు.

మూలమళ్లలో ఎద్దుల గిరక పోటీలు

అమరచింత: ఆత్మకూర్ మండలంలోని మూలమళ్లలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని రెండు బండ్ల ఎద్దుల గిరక ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలను ఈనెల 30న ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతిని రూ.16 వేల నగదును మార్కెట్ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, రెండో బహుమతిని రూ.12 వేలను సర్పంచ్ ప్రశాంతిరాజు, మూడో బహుమతిని రూ.8 వేలను బీఆర్ఎస్ మండల బీసీసెల్ అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నాల్గవ బహుమతిని రూ.6 వేలను మూలమళ్ల ఉపసర్పంచ్ రంగారెడ్డి అందిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే వారు సెల్ నంబర్లు 90147 98759, 97013 29134, 90149 99702, 63044 84264, 90144 86813 లకు సమాచారం అందించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

క్రికెట్..

వీపనగండ్ల: శ్రీరామనవమిని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రికెట్ క్రీడాకారులు తమ పేర్లను 29వ తేదీ వరకు నమోదు చేయించుకోవాలని కోరారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన జట్లకు మొదటి ప్రోత్సాహక బహుమతిగా రూ.10వేల నగదు, రెండో బహుమతిగా రూ.5వేలు, ప్రతి మ్యాచ్‌కి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ పోటీలు 30వ తేదీన ప్రారంభమవుతాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్లు 96182 00106, 97052 47628 ను సంప్రదించాలని కోరారు.

బస్సులను పునరుద్ధరించండి

మదనాపురం: మండలంలోని దుప్పల్లి, కొత్తపల్లి గ్రామాల మీదుగా ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో హైదరాబాద్ వెళ్లే షాద్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కొంతకాలం కిందట ఈ బస్సులను అధికారులు అర్ధాంతరంగా రద్దు చేయడంతో ప్రతిరోజూ హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని వీరాయిపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠోత్సవానికి గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనంతో తరలివచ్చి బొడ్రాయి వద్ద పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. రైతుబంధు మండల అధ్యక్షుడు రాజాప్రకాష్‌రెడ్డి దంపతు లు బొడ్రాయికి పూజలు చేశారు.



అభివృద్ధి పనులకు సహకరించండి


పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ సిద్ధయ్య

కొత్తకోట రూరల్: గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రజలందరూ సహకరించాలని సర్పంచ్ సిద్ధయ్య కోరారు. పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలోని తొమ్మిదో వార్డులో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నుంచి మంజూరయిన నిధులతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సీసీ పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో రైతుబంధు కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు చెన్నయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పాన్‌గల్: మండలంలోని రాయినిపల్లి సర్పంచ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి మండల సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో రూ.80 వేల ఆర్థికసాయాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మండల సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో తమ వంతు సాయంగా నగదును సర్పంచ్ భార్య నీలమ్మకు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటయ్యయాదవ్, మౌనిక యాదవ్, నాగేష్‌నాయుడు, విష్ణునాయుడు, జయరాములుసాగర్, రంగానాయక్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు వనపర్తి పుట్టినిల్లు


అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న కళాకారులు

వనపర్తి: ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా సాహితీ కళావేదిక ప్రతినిధులు మంగళవారం అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌ను ఆయన కార్యాలయంలో కలిసి ఘనంగా సన్మానించారు. కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ మాట్లాడుతూ కళాకారుల కుటుంబ నేపథ్యం ఉన్న వేణుగోపాల్ వాద్య సంగీత కళాకారుడిగా దేశ విదేశాలలో ఎన్నో సంగీత కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. ఎంతో మంది ప్రజాప్రతినిధులు, సుప్రసిద్ధ కళాకారులు ఆయనను ప్రతిభను ప్రశంసిస్తూ సన్మానించిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. ఒక పదవికి అందులో ఉన్నంత కాలం గుర్తింపు ఉంటుంది. కానీ కళాకారుడికి జీవితమంతా సమున్నతమైన గౌరవం, గుర్తింపు ఉంటుందని శంకర్‌గౌడ్ అన్నారు. అనంతరం సన్మాన గ్రహీత వేణుగోపాల్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో ఎంతోమంది మంచి ప్రతిభ కలిగిన కళాకారులు ఉన్నారని, వారు మరింత కృషితో తమతమ కళలలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కందూరు నారాయణరెడ్డి, జనజ్వాల, బైరోజు చంద్రశేఖర్, డాక్టర్ శ్యాంసుందర్, పోల్కంపల్లి సుజాత, బండారు శ్రీనివాసులు, గుడిసె శివలింగం తదితరులు పాల్గొన్నారు.

‘సహకారం’తో స్వయం సమృద్ధి


మాట్లాడుతున్న వంశీధర్‌రెడ్డి

కొత్తకోట: సంఘ సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా పరస్పర సహకారమే లక్ష్యంగా రైతులు స్వయం సమృద్ధి సాధించాలని కొత్తకోట సింగిల్ విండో చైర్మన్ కొట్టం వంశీధర్‌రెడ్డి కోరారు. కొత్తకోట సింగిల్ విండో కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మంగళవారం మహాజన సభ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. సహకార సంఘాల సభ్యులైన రైతులకు ఆర్థిక భరోసా కల్పించడానికి డీసీసీబీలు నెలకొల్పినట్లు తెలిపారు. సహకార కేంద్ర బ్యాంకులు రైతులకే కాకుండా మహిళా పొదుపు సంఘాలకు, చిరు వ్యాపారులకు, పెట్రోల్ బంకుల ఏర్పాటుకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నాయన్నారు. రైతులు తీసుకున్న అప్పులు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పాడాలని కోరారు. గ్రామీణ యువత తక్కువ వడ్డీతో రుణాలు పొంది తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రజలు క్రియాశీల పాత్ర పోషించినప్పుడే సంఘాలు బలోపేతం అవుతాయన్నారు. అనంతరం గతేడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు జమ, ఖర్చుల ఆమోదం, అంచనా బడ్జెట్ వంటి పలు అంశాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో సీఈఓ బాలరాజు చారి, డైరెక్టర్లు బాలకృష్ణ, భాస్కర్, నాగరాజు, నాగేంద్రం, రాంలాల్ నాయక్, సురేష్, సువార్తమ్మ, లక్ష్మి, రాజు, మురళి, నరసింహ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి: ఎంపీపీ


మాట్లాడుతున్న ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి

పాన్‌గల్: పల్లెలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేలా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మహిళ సంఘాల వీఓఏలు, ఉపాధి సిబ్బందికి స్వచ్ఛ భారత్ మిషన్(ఎస్‌బీఎం)పై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణ, తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వడం, ప్లాస్టిక్ నిర్మూలన, ఇంకుడు గుంతల ఏర్పాటు, పారిశుద్ధ్య నివారణ అంశాలను గ్రామాలల్లో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ఆయా అంశాలపై ఎస్‌బీఎం జిల్లా అధికారులు రమేష్, ఫరీదా, మస్టర్ ట్రెయినర్ రాజు అవగాహన కల్పించారు. సమావేశంలో ఏపీఓ కుర్మయ్య, ఎంపీఓ రఘురాములు, ఈసీ రఘు, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

ఒక యూనిట్‌కు 91 దరఖాస్తులు


అమరచింతలో అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు


పెబ్బేరులో..

అమరచింత: మున్సిపాలిటీ పరిధిలోని ముస్లిం మైనార్టీల కోసం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఒకే ఒక్క యూనిట్ మంజూరు కాగా వీటి కోసం 91 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ సబ్ మేనేజర్ బస్వారాజు హాజరు కాగా మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్‌ఖాజా సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. రూ.రెండు లక్షల విలువ గల ఒకే ఒక్క యూనిట్ కోసం ముస్లిం మైనార్టీకి చెందిన 91 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోగా.. ఇంటర్వ్యూలకు 54 మంది హాజరైనట్లు కమిషనర్ తెలిపారు. దీంతో నిరుద్యోగులు మరిన్ని యూనిట్లు పెంచాలని కోరుతున్నారు.

పెబ్బేరు: మున్సిపాలిటీ కార్యాలయంలో ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలు మంగళవారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఆదిశేషు మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఆరు యూనిట్లు మాత్రమే మంజూరు కాగా.. 53 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఎస్‌బీఐ, ఏపీజీవీబీ, యూనియన్ బ్యాంకులకు సంబంధించిన మేనేజర్లు దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, మేనేజర్ గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మైనార్టీ నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అఫ్జల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10గంటల 30నిమిషాల నుంచి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, ఇంటర్వ్యూలకు వచ్చే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలను, ఆధార్ కార్డు, ఆదాయం సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులు సదరం సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు.

కుమారుడిని పిచ్చాస్పత్రికి తరలించాలని వినతి

ఖిల్లాఘనపురం: గ్రామంలో ఇష్టానుసారంగా తిరుగుతూ కనిపించిన వారిపై దాడులు చేస్తున్న తన కుమారుడిని ఎర్రగడ్డ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించాలని ఓ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన ఖిల్లాఘనపురంలో చోటు చేసుకుంది. ఫిర్యాదుదారుడి వివరాల ప్రకారం మండలంలోని అల్లమాయపల్లికి చెందిన బదుగని బాలయ్య పెద్ద కుమారుడు బదుగని నర్సింహులు పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తూ గ్రామంలో కనిపించిన వారితో గొడవలు పెట్టుకుని కొడుతున్నాడని వాపోయారు. గ్రామస్తులు బాలయ్య ఇంటికి వచ్చి నీ కొడుకుని హద్దులో పెట్టుకోవాలని హెచ్చరిస్తుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఎంతకూ తన కుమారుడి పరిస్థితి మారక పోవడంతో చేసేది లేక మంగళవారం ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయపై అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీహరి తెలిపారు.

క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



గోపాల్‌పేట: ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా మంజూరయిన నిధులతో మంగళవారం జెడ్పీటీసీ సభ్యురాలు భార్గవి మండలంలోని బుద్దారం పాటిగడ్డతండాలో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామాలను అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో రైతుబంధు అధ్యక్షుడు తిరుపతియాదవ్, సర్పంచ్ పద్మ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం



పాన్‌గల్: మండలంలోని దావాజిపల్లి సర్పంచ్ వెంకటయ్యయాదవ్‌కు ప్రజా ఆరోగ్యంపై దీన్ దయాళ్ పురస్కార్ అవార్డు మండల స్థాయిలో ప్రథమ, జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి అందుకోవడాన్ని హర్షిస్తూ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం మంగళవారం శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో కొనసాగిస్తూ రాష్ట్ర స్థాయిలో అవార్డు సాధించాలని ఉపాధ్యాయ బృందం ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బద్రూనాయక్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ



చిన్నంబావి: మండలంలోని కొప్పునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బీసీ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ యూత్ నాయకులు జాలరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా వార్షిక పరీక్షలు రాయాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రాంతికుమార్, చల్ల మధు, సాయికుమార్, మహేశ్, అశోక్, హరినాథ్, ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఈత చెట్ల నరికివేతపై ఫిర్యాదు



పెబ్బేరు: మండలంలోని గుమ్మడం నర్సరీలో పెంచుతున్న ఈత చెట్లను నరికిన వారిపై మంగళవారం రాఘవేందర్‌గౌడ్ ఫిర్యాదు చేశారు. నర్సరీలో పెంచుతున్న 25 మొక్కలను కొందరు వ్యక్తులు జేసీబీతో తొలగించడంతో గౌడలు జీవనోపాధి కోల్పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పంచాయతీ కార్యదర్శి బాలరాజుకు ఫిర్యాదు చేసి, నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ బలోపేతానికి కృషి

పెబ్బేరు రూరల్: కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ విస్తారక్ కేతూరి బుద్ధన్న సూచించారు. మంగళవారం శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లిలో శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ ఎల్లస్వామి ఆధ్వర్యంలో బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ హాజరై కార్యకర్తలతో మాట్లాడారు. 2023 ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు వెంకటస్వామి, బూత్ అధ్యక్షుడు నరేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కొత్తకోట రూరల్: తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు ఎండల తీవ్రత నుంచి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో పెద్దమందడి తహసీల్దార్ సంధ్య కార్యాలయంలో మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ తిరుపతయ్య, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సత్యారెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 69 క్యూసెక్కులు

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో మంగళవారం సాయంత్రం 1,018 అడుగుల మేర నీటిమట్టం ఉంది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వకు నీటిని నిలిపివేశారు. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 69 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రవీల్ రెడ్డి తెలిపారు.